క్లుప్తంగా

ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా అధ్యక్షుడిగా గురవయ్య


నియామకపత్రం అందుకుంటున్న గురవయ్య

మార్కాపురం టౌన్: జిల్లా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షునిగా బూదాల గురవయ్య నియమితులయ్యారు. గురువారం విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీల హక్కుల చట్టం అమలుకు, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గురవయ్య చెప్పారు.

టెన్త్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2024 పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 71 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 566 మార్కులతో మండల ద్వితీయ స్థానంతో పాటు, 500 మార్కులను 15 మంది విద్యార్థులకు పైగా సాధించారని వివరించారు. ఉత్తమ ఫలితాలతో మార్కాపురం డివిజన్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా గుర్తింపు పొందడంపై హెచ్ఎం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమష్టి కృషితో నూరు శాతం ఫలితాలు సాధించామన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు పంపిణీ


ఇంగ్లిష్ పుస్తకాలు అందజేస్తున్న చంద్రయ్య

కొనకనమిట్ల: మండలంలోని ఇరసలగుండం ఎస్సీ కాలనీలో పలువురు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను పంపిణీ చేశారు. స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను రైల్వే ఎక్స్‌ప్రెస్ గార్డ్ ఎస్ఎల్ శ్రీధర్ ఆర్థిక సహకారంతో 60 మంది పేద విద్యార్థులకు గురువారం శ్రీధర్ సన్నిహితులు వి.చంద్రయ్య అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఇంగ్లిష్ పైనే ఆధారపడి ఉందన్నారు. విద్యాభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కరేటి రామకోటేశ్వరరావు, ఎల్.కేశవులు, బ్రహ్మయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లో, దరగా రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆకుపూజ, భజనలు, హనుమాన్ చాలిసా పారాయణం పూజలు జరుగుతాయన్నారు. జంక్షన్‌లో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు


శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, కథలు వినిపించడం, కథలు చెప్పడం, చెస్‌పై శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరానికి 32 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌కు సన్మానం


హాస్టల్ వార్డెన్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు కాశయ్య, రమణారెడ్డి

బేస్తవారిపేట: స్థానిక విద్యావనరుల కేంద్రంలో గలిజేరుగుళ్ల హాస్టల్ వార్డెన్ కొండా లక్ష్మీకాంతరెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థి ఎస్.భరత్ 589 మార్కులు సాధించడంతో కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వార్డెన్‌కు ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డిలు శాలువా, పూలమాలలతో సన్మానించారు. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎంఆర్సీ సిబ్బంది, యూటీఎఫ్ నాయకులు ఐవీ రామిరెడ్డి, రాజశేఖరరెడ్డి, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపెవరిదైనా ప్రశాంతంగా ఉండండి


సుందరయ్య కాలనీలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రెహమాన్


సిద్ధవరంలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మల్లికార్జునరావు

మార్కాపురం: ఎన్నికల కౌంటింగ్ అనంతరం గెలుపెవరిదైనా ప్రజలు ప్రశాంతంగా ఉండాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఉదయం పట్టణ శివారులోని సుందరయ్య కాలనీ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పది వాహనాలను సీజ్ చేశారు. కాలనీవాసులకు సీఐ కౌన్సిలింగ్ ఇస్తూ ఎన్నికల రోజున కొంతమంది గొడవలు చేసేందుకు ప్రయత్నించారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు అనంతరం ప్రశాంతంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి గొడవలు చేయవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కాలనీలోకి వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఎస్సైలు రెహమాన్, నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని సిద్దవరం గ్రామంతో పాటు ఎస్సీ కాలనీల్లో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పొదిలి సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఎస్సై మాధవరావు తన సిబ్బందితో సిద్దవరం, ఎస్సీ కాలనీలోని పలు నివాస గృహాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. ముందుగా పోలీసు బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించి, శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు.

తర్లుపాడు: జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై వేముల సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. కౌంటింగ్ రోజు మండలంలోని అన్నీ గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ప్రజలు గుమిగూడటం, బాణసంచా కాల్చడం, సంబరాలు చేసుకోవడం, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు.


మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

మీ సేవ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

డీఎల్‌డీఓ సాయికుమార్


మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ సాయికుమార్

మార్కాపురం రూరల్: మీ సేవ కేంద్రాలను నిర్వాహకులు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సక్రమంగా నిర్వహించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని డివిజనల్ డెవలప్‌మెంటు ఆఫీసర్ సాయికుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లోని పలు మీ సేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దారవీడు, దరిమడుగు, రాయవరం, గజ్జలకొండ గ్రామాల్లోని మీ సేవ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచి అవసరమైన సర్టిఫికెట్లను ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు తీసుకుని అందజేయాలని సూచించారు. అధనంగా వసూలు చేస్తే కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సర్టిఫికెట్ల స్టాక్ రిజిస్టర్, మూవ్‌మెంట్, కంప్లెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామకోటయ్య

బేస్తవారిపేట: ఓట్ల లెక్కింపు రోజున నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జె.రామకోటయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని జేబీకే పురంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని కోరారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎక్కడా ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. బేస్తవారిపేట, కంభం ఎస్సైలు నరసింహారావు, రాజేష్, పోలీసులు పాల్గొన్నారు.

లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

కొమరోలు: జాతీయ ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలానికి కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్ఆర్‌జీఎస్ పీడీ బి.అర్జునరావు తెలిపారు. మండలంలోని తాటిచెర్ల, దద్దవాడ, నల్లగుంట్ల గ్రామాల్లో గురువారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ రాయితీపై జాబ్ కార్డులు ఉన్న వారు 200 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. వ్యవసాయ పొలాల్లో 300 నీటి కుంటలు మంజూరయ్యాయని, ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఉపాధి కూలీలు నీటికుంటలను తవ్వాలని తెలిపారు. ఏపీడీ భాస్కర్‌రావు, ఎంపీడీఓ నరసింహారావు, ఏపీఓ మహాలక్ష్మి పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ రాహుల్

పొదిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సికిల్ సెల్ అనిమియా వ్యాధిపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. గిరిజనులు అధికంగా సికిల్ సెల్ అనీమియా బారిన పడుతున్నారని చెప్పారు. త్వరలో వారికి పరీక్షలు నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పరీక్షలకు అవసరమైన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో 12 ప్రాథమిక కేంద్రాలు వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డైట్‌సెట్‌లో మార్కాపురం విద్యార్థికి 4వ ర్యాంకు


వెంకటేశ్వరరెడ్డి


హేమంత్ కుమార్

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన ఏపీ డైట్‌సెట్ ఫలితాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన పి.వెంకటేశ్వరరెడ్డి జిల్లా 4వ ర్యాంకు, మండ్ల హేమంత్ కుమార్ 79వ ర్యాంకు సాధించినట్లు జ్ఞానశ్రీ అకాడమీ డైరెక్టర్ ఎం.మల్లికార్జున్ తెలిపారు. వెంకటేశ్వరరెడ్డి, హేమంత్‌లు తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లోనూ ర్యాంకులు సాధించారని చెప్పారు.

మేధో వికాసానికి చెస్ దోహదం


విద్యార్థులకు చెస్ నేర్పుతున్న ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: చెస్ నేర్చుకోవడం ద్వారా తెలివితేటలను పెంచుకోవచ్చని ఉపాధ్యాయుడు ఒ.రవిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆయన విద్యార్థులకు చెస్ ఆటలో మెళకువలు నేర్పారు. సాధనా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ హెచ్ఓడీ డాక్టర్ ఎం.శేషకుమార్ ఫిజిక్స్‌లో పలు సూచనలిచ్చారు. వ్యక్తిత్వ వికాసం గురించి కొల్లి విజయలక్ష్మి వివరించారు. గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి పాల్గొన్నారు.

సాగర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

పొదిలి: స్థానిక తూర్పుపాలెంలో సాగర్ నీరు కలుషితం కావడంపై గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి స్పందించారు. తూర్పుపాలెంలో మురుగునీరు సరఫరా అయిన ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించారు. పైప్ లైనుకు మరమ్మతులు చేయించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కార్మికుల సమస్యలపై సీఐటీయూ పోరాటం


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న రఫీ

మార్కాపురం: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తోందని జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సుబ్బరాయుడు, గురునాథం, హరి, సలాంఖాన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు సీజ్

రాచర్ల: మండలంలోని యడవల్లిలో గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్, ఎస్సై పి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం ఉదయం కార్డెన్ సర్చ్ చేశారు. గ్రామంలో పోలీసుల బలగాలతో కవాతు చేశారు. అనంతరం సీఐ దాసరి ప్రసాద్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూదని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కౌంటింగ్ అయినా జూన్ 6 వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్డెన్ సర్చ్‌లో భాగంగా సరైన పత్రాలు లేకపోవడంతో నాలుగు మోటారు సైకిళ్లు, ఒక కారును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

కంభం: మండల కేంద్రం కంభంలో గురువారం రాత్రి వాహనాలను ఎస్సై పులి రాజేష్ అధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై పులి రాజేష్ మాట్లాడుతూ అధిక శబ్దాలతో బుల్లెట్ వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. బుల్లెట్ మోటారు సైకిళ్లు, స్పోర్ట్స్ బైక్‌లు నడిపేవారు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్ మాత్రమే వినియోగించుకోవాలని తెలిపారు. సైలెన్సర్లు మార్చి అధిక శబ్దాలు వచ్చే వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మూడు బుల్లెట్‌లు సీజ్ చేసి వాటికి ఉన్న సైలెన్సర్‌లు తొలగించారు.

ఘనంగా బాబా పంచమ వార్షికోత్సవం


తర్లుపాడులో స్వామివారి సేవలో పాల్గొన్న భక్తులు

తర్లుపాడు: స్థానిక షిరిడీ సాయి మందిరం పంచమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. బాబాను స్మరించుకుంటూ పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ ఎం.నాగమల్లికార్జున, కమిటీ సభ్యులు శంకర్, కోటేశ్వరరావు, నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య, రిటైర్డు ఎంఈఓ కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అభిషేకం, చెన్నమల్లేశ్వర స్వామి భజన బృందంతో సాయినామ భజన, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

వేడుకగా సీతారాముల కల్యాణం

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో గురువారం సీతారాముల కల్యాణం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు వైభవంగా సాగుతున్నాయి. కల్యాణ ఉభయ దాతలుగా చినారికట్లకు చెందిన వేణుగోపాల్, సుజాత, వెంకటరెడ్డి, అంజనీదేవి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు. శుక్రవారం శ్రీవైకుంఠ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని అలాగే జూన్ 1వ తేదీ వరకు శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

రైతుల పనులకు ప్రాధాన్యం ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

గిద్దలూరు రూరల్: రైతులకు సంబంధించిన పొలంలో ఫారం పాండ్ వంటి ఇతర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జున్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లతో గురువారం ఉపాధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల హాజరు, కూలీల కనీస వేతనాలు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఎక్కువ పనిదినాలు కల్పించడంపై సిబ్బందిని అడిగారు. మండలానికి ఉద్యానవనశాఖ కింద 200 ఎకరాలు టార్గెట్ ఇచ్చామని, 5 ఎకరాల పొలం ఉన్న రైతులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 10 ఎకరాలు పొలం ఉండవచ్చని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి రైతు వారి ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ఆ విధంగా రైతులను ప్రోత్సహించేలా ప్రతి అధికారి పనిచేయాల్సి ఉంటుందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించే పనుల్లో ఎవరైన సరే అవకతవకలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి హామీ పనులను అందరికీ ఉపయోగపడే విధంగా చేయించేందుకు ప్రయత్నించాలన్నారు. ఏపీడీ ఎస్.భాస్కర్‌రావు, ఎంపీడీఓ హేమలత, ఏపీఓ రమణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

4న 144 సెక్షన్ అమలులో ఉంటుంది


మాట్లాడుతున్న సీఐ వైవీ సోమయ్య

గిద్దలూరు రూరల్: వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సమయంలో గిద్దలూరులో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరూ గుంపులుగా గుమిగూడవద్దని స్థానిక సీఐ వైవీ సోమయ్య గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. అందరి రక్షణ పోలీసుల బాధ్యత అని, అందులో భాగంగానే ఇటీవల కార్డెన్ సెర్చ్ ద్వారా ప్రతి గృహాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాన్ని గౌరవించాలన్నారు. ఇప్పటి వరకు 650 మందిని బైండవర్ చేశామని, ఆ సమయంలో ఎలాంటి ఘర్షణలో పాల్గొన్నట్లు తెలిసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఉంటుందన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి ఆవేశాలకు లోనై అల్లర్లకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు 4వ తేదీన సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా


సీసీ కెమెరాల పనితీరును వివరిస్తున్న ఎస్సై కోటయ్య

పొదిలి: శాంతి భద్రతలు, ట్రాఫిక్‌కు సంబంధించి నిరంతర నిఘా కోసం డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు. శాంతి భద్రతలకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్లకు వివరించారు. పట్టణంలోని కూడళ్లతో పాటు, మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ అనంతరం జరిగే పరిణామాలను నిశితంగా గమనించనున్నట్లు చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని రూట్లలో మొబైల్ టీమ్ సంచరిస్తుందని, ఎక్కడ ఏ సంఘటన జరిగినా పది నిముషాల వ్యవధిలో గ్రామాలకు చేరుకునే విధంగా ఫోర్స్‌ను అప్రమత్తం చేశామని వెల్లడించారు.

144వ సెక్షన్ అమలు

బందోబస్తులో భాగంగా 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఫలితాల అనంతరం ప్రజలు సమన్వయం పాటించాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, ఎదుటి వారిని అవమాన పరిచే వ్యాఖ్యలు, నినాదాలు చేయవద్దని కోరారు. పార్టీ జండాలతో ర్యాలీలు, టపాసులు కాల్చటం, రంగులు చల్లుకోవటం చేయవద్దన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని చెప్పారు. నిభందనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

దొనకొండ: సీఐటీయూ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన గురువారం ఆ సంఘ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పౌర సరఫరాల గోడౌన్ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ జిల్లా అధ్యక్షుడు తాండవ రంగారావు పాల్గొని మాట్లాడారు. మన హక్కుల కోసం మనం పోరాడి హక్కులు సాధించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ఆదాం, కె.అనిల్, కర్నా హనుమయ్య పాల్గొన్నారు.